

మంగళూరులో జరిగిన సమావేశానికి హాజరైన ఎంపీ వద్దిరాజు

## స్థాయీసంఘం సమావేశానికి వద్దిరాజు

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): పెట్రోలియం, సహజవాయువు శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం సమావేశానికి బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర హాజరయ్యారు. స్టాండింగ్ కమిటీ అధ్యయన యాత్రలో భాగంగా శుక్రవారం మంగళూరులో చైర్మన్ సునీల్ తర్కరే ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెట్రోలియం, సహజవాయువు ఉత్పత్తులు, వాటి ధరలు, వినియోగదారులకు అందుతున్న సేవలు, డిమాండ్, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. వద్దిరాజు తన విలువైన సలహాలు, సూచనలు ఇచ్చారు.

## పదేండ్ల బాలికపై లైంగిక దాడి

- ఇంట్లో ఒంటరిగా ఉండగా బాలుడి అఘాయిత్యం
- కేసు నమోదు చేసిన జడ్చర్ల పోలీసులు

జడ్చర్ల టౌన్, జూన్ 20 : పదేండ్ల బాలికపై 16 ఏండ్ల బాలుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికుల కథనం మేరకు.. జడ్చర్ల మండలంలోని ఓ గ్రామంలో బాలికను ఒంటరిగా ఇంట్లో ఉంచి ఆమె తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లారు. ఈ విషయాన్ని గమనించిన అదే గ్రామానికి చెందిన పదహారేండ్ల బాలుడు బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో చిన్నారి అస్వస్థతకు గురై వాంతులు చేసుకోగా రెండ్రోజుల కిందట ఆమె తల్లి 108 వాహనంలో పాలమూరు జిల్లా దవాఖానకు తరలించింది. చికిత్స సమయంలో బాలికపై లైంగికదాడి జరిగినట్టు గుర్తించిన వైద్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. జడ్చర్ల పోలీసులు విచారణ మొదలెట్టారు. ఎస్పీ జానకి శుక్రవారం జడ్చర్ల పోలీస్ స్టేషన్‌కు చేరుకొని సీఐ కమలాకర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విచారణ వేగంగా చేపట్టి నిందితుడికి శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాలిక చెప్పిన వివరాల ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ కమలాకర్ తెలిపారు. కాగా బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు తెలిసింది.

## దొంగ అనుకుని కొట్టి చంపారు!

**నాందేడ్‌లో హైదరాబాదీ హత్య**

ముంబై, జూన్ 20 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో జరిగిన దారుణహత్య ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ధనోరా రైల్వేస్టేషన్‌లో దిగిన ఓ యువకుడిని దొంగగా భావించి, గ్రామస్తులు కొట్టి చంపారు. రంగంలోకి దిగిన పోలీసులు నెట్‌గ్రిడ్ వ్యవస్థ ద్వారా సదరు యువకుడు హైదరాబాద్‌కు చెందిన షేక్ ఫర్దీన్‌గా గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం ఈ నెల 10న ధనోరా రైల్వేస్టేషన్‌లో ఫర్దీన్ దిగాడు. అనుమానాస్పదంగా కనిపించడంతో ధనోరా గ్రామస్తులు తరిమికొట్టారు. ఆ తర్వాత అతడు ఓ జిమ్ దగ్గరకు వెళ్లాడు. అక్కడ ఫర్దీన్ దొంగ అనుకుని యువకులు దారుణంగా కొట్టారు. బలమైన గాయాలు కావడంతో అతను మరణించాడని పోలీసుల దర్యాప్తులో తేలింది. కేసులో నలుగురిని అరెస్టు చేయగా, వారిలో ఇద్దరు మైనర్లు ఉన్నారని పోలీసులు వెల్లడించారు. హత్యలో మరికొందరి ప్రమేయం ఉండొచ్చని అనుమానం వ్యక్తంచేస్తున్నారు. మృతుడి కుటుంబానికి సమాచారం అందించామని, దర్యాప్తు కొనసాగుతుందని నాందేడ్ జిల్లా ఎస్పీ అవినాశ్ కుమార్ తెలిపారు.

## వైద్య కళాశాలల్లో బదిలీలు చేపట్టాలి

**మహిళా ప్రొఫెసర్ల డిమాండ్**

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం బదిలీలు చేపట్టాలని వైద్య కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా ప్రొఫెసర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ప్రజాపాలనలో మెడికల్ కాలేజీల్లోని మహిళా ప్రొఫెసర్ల మొర ఎవరూ ఆలకించడం లేదని వాపోయారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మాండేటరీ ట్రాన్స్‌ఫర్ల పేరిట ఉస్మానియా, గాంధీ, కాకతీయ మెడికల్ కాలేజీల ప్రొఫెసర్లను ఇష్టారాజ్యంగా బదిలీ చేశారని పేర్కొన్నారు. 11 ఏండ్లుగా మహబూబ్‌నగర్, నిజామాబాద్, అదిలాబాద్, సిద్దిపేట, సూర్యాపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, జగిత్యాల, నల్లగొండ మెడికల్ కాలేజీల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లను హెల్త్ సెక్రటరీ, ఆరోగ్యశాఖ మంత్రి పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

## హామీలపై కాంగ్రెస్‌ను నిలదీయాలి

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ) : ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ఎక్కడికక్కడ నిలదీయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో తాజా రాజకీయ పరిస్థితులు, రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలు, మండలాలు, గ్రామాల్లో కొత్త కమిటీలు ఏర్పాటు చేసుకున్నామని, ప్రభుత్వంపై పోరుకు సిద్ధం కావాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై బీజేపీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

## ఏజెన్సీ ప్రాంతాల్లో పాక్షిక బంద్

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో మావోయిస్టుల బంద్ శుక్రవారం పాక్షికంగా కొనసాగింది. కగార్ దాడిని నిరసిస్తూ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో శుక్రవారం బంద్‌ను జయప్రదం చేయాలంటూ ఈ నెల 15న మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు టీఎల్‌ఎన్‌ఎస్ చలం సహా ఏడుగురి ఎన్‌కౌంటర్‌ను నిరసిస్తూ ఈ బంద్‌కు పిలుపునిచ్చినట్టు ఆ పార్టీ ప్రకటించింది. ఆ తర్వాత రెండు రోజులకే మరో కీలక నేత గాజర్ల రవితోపాటు ఇద్దరు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. ఈ ఘటన తర్వాత మావోయిస్టుల నుంచి ఎలాంటి ప్రకటన వెలువడకపోయినా కూడా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లితోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో అక్కడక్కడా బంద్ కొనసాగింది. బంద్ విజయవంతం కాకుండా పోలీసులు ఎక్కడిక్కడే బలగాలతో కూంబింగ్ నిర్వహించారు.

## చంచల్‌గూడ జైలుకు అవార్డు

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర జైళ్లశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న చంచల్‌గూడ జైలు పెట్రోల్ బంక్ హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్లలోనే పెట్రోల్ అమ్మకంలో మొదటి స్థానంలో నిలిచింది. 2024-25 సంవత్సరంలో రూ.75 కోట్ల విలువైన 69 లక్షల లీటర్ల పెట్రోల్ అమ్మకాలతో మరోసారి 'ఉత్తమ పెట్రోల్ బంక్' అవార్డు సొంతం చేసుకున్నది. డివిజనల్ సేల్స్ జనరల్ మేనేజర్ సుబ్రతో రాయ్ ఈ అవార్డును జైలు సూపరింటెండెంట్ శివకుమార్‌గౌడ్‌కు అందజేశారు. శివకుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. వరుసగా ఉత్తమ పెట్రోల్ బంక్ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. పెట్రోల్ అమ్మకాలతో వచ్చిన లాభాలను ఖైదీల సంక్షేమం, జైళ్లశాఖ అభివృద్ధికి ఉపయోగిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సేల్స్ అధికారులు, చంచల్‌గూడ జైలర్ దేవ్‌సింగ్, హెడ్ వార్డర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో తడాఖా చూపుతాం

**గర్జించిన నిరుద్యోగలోకం**

- నిరుద్యోగులకు కాంగ్రెస్ ద్రోహం
- జీవో 46, 29ను రద్దు చేయాలి
- జాబ్ క్యాలెండర్‌పై క్లారిటీ ఇవ్వాలి
- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే భారీగా ఉద్యోగ నోటిఫికేషన్లు
- రేవంత్‌కు చరమగీతం పాడుతాం
- ఇందిరాపార్కు మహాధర్నాలో నిరుద్యోగుల ఆగ్రహజ్వాల
- ధర్నాకు ఎంపీ ఆర్ కృష్ణయ్య, బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి, సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి, బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి మద్దతు



ధర్నా చౌక్ వద్ద నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): విద్యార్థి, నిరుద్యోగులకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకపోతే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గట్టి బుద్ధిచెప్పి తడాఖా చూపుతామని నిరుద్యోగ యువకులు హెచ్చరించారు. నిరుద్యోగులపై కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా శుక్రవారం హైదరాబాద్ ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో విద్యార్థి, నిరుద్యోగుల మహాధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నిరుద్యోగ యువత చేసిన నినాదాలు మిన్నంటాయి. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, నిరుద్యోగులను నిండా ముంచి, తమ ప్రయోజనాలు మాత్రమే కాపాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయడంపై క్లారిటీ ఇవ్వని సీఎం రేవంత్ ద్వంద్వ వైఖరికి నిరసనగా త్వరలోనే రాష్ట్రవ్యాప్త పోరాటానికి కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు. జీవో 46ను, జీవో 29ని వెంటనే రద్దు చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి చరమగీతం పాడుతామని హెచ్చరించారు. మహాధర్నాకు బీసీ నేత, ఎంపీ ఆర్ కృష్ణయ్య, బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర నాయకుడు జూలకంటి రంగారెడ్డి, కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్‌తోపాటు పలువురు మద్దతు తెలిపారు. నిరుద్యోగ జేఏసీ నేత నీలం వెంకట్, పృథ్వీ, ప్రసన్న హరికృష్ణ, అశోక్, జనార్దన్, మోతీలాల్‌నాయక్, సంజయ్ నాయక్ సహా నిరుద్యోగులు హాజరయ్యారు.

### బీఆర్ఎస్ హయాంలోనే నోటిఫికేషన్లు

తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హయాంలోనే నిరుద్యోగుల కోసం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదలయ్యాయని మహాధర్నాలో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ నాయకులు స్పష్టంచేశారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3తోపాటు ఉపాధ్యాయ, పోలీస్ ఉద్యోగాల భర్తీకి బీఆర్ఎస్ హయాంలోనే నోటిఫికేషన్లు విడుదలయ్యాయని జేఏసీ నాయకులు తెలిపారు.

### నిరుద్యోగులతో బీజేపీ ఎమ్మెల్సీకి వాగ్వాదం

'పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన జీవో 46 రద్దు గురించి బీజేపీ ఏ స్టాండ్ తీసుకున్నది. ఈ జీవో గురించి బీజేపీ ఎందుకు మాట్లాడటం లేదు' అని మహాధర్నాకు వచ్చిన ఆ పార్టీ ఎమ్మెల్సీ అంజిరెడ్డిని నిరుద్యోగులు నిలదీశారు. ఆయన వివరణ ఇచ్చే ప్రయత్నం చేసినా నిరుద్యోగులు సంతృప్తి చెందలేదు. బీజేపీ స్టాండ్ చెప్పాలంటూ గట్టిగా పట్టుబట్టారు. వేదికపై మాట్లాడుతున్న ఆయనను నిరుద్యోగులంతా అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డికి, నిరుద్యోగుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకున్నది. ఈ క్రమంలోనే ఎమ్మెల్సీపై ప్రశ్నలవర్షం కురిపించారు. అక్కడ పరిస్థితి అదుపు తప్పే క్రమంలో నిరుద్యోగ జేఏసీ నాయకులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కబెట్టారు. అనంతరం మధ్యలోనే ఎమ్మెల్సీ అంజిరెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి

### రేవంత్‌రెడ్డి మాటలు పచ్చి అబద్ధాలు

ఒక్క ఉద్యోగాన్ని సొంతంగా భర్తీ చేయకున్నా, వేలాది ఉద్యోగాలు భర్తీ చేశామని సీఎం రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు చెప్పుకుంటున్నారు. సీఎం స్థాయిలో అబద్ధాలాడటం భావ్యం కాదు. ఉద్యోగాల కోసం ఇందిరాపార్కు ధర్నాకు వేలాదిగా తరలివచ్చాం. వెంటనే జ్యాబ్ క్యాలెండర్ ప్రకటించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం. రేవంత్‌రెడ్డిని కొడంగల్‌లో ఓడించి తీరుతాం.

– నిరుద్యోగి, నల్లగొండ జిల్లా

### కాంగ్రెస్‌కు ఓటేసేదే లేదు

వచ్చే పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓట్లు వేసే ప్రసక్తేలేదు. రేవంత్ సర్కార్‌కు బుద్ధి చెప్పి తీరుతం. గత అసెంబ్లీ ఎన్నికల్లో జాబ్ క్యాలెండర్ వేస్తామంటేనే కాంగ్రెస్‌కు ఓట్లేశాం. అధికారంలోకి వచ్చాక 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తే.. మేమంతా ఇందరాపార్కు వద్దకు చేరుకుని ధర్నా చేయాల్సిన అవసరం ఎందుకు వస్తుంది.

– నిరుద్యోగిని, హుజురాబాద్

### జాబ్ క్యాలండర్ ఏమైంది?: బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి

ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన జాబ్‌క్యాలెండర్ ఏమైందని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల ఉద్యోగాలు భర్తీ కోసం నోటిఫికేషన్లు విడుదల చేయాలని, జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీస్ ఉద్యోగాలకు అడ్డంకిగా ఉన్న జీవో 46ను వెంటనే రద్దు చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. గ్రూప్-1కు సంబంధించిన జీవో 29ని రద్దు చేసి నిరుద్యోగులకు మేలు చేయాలని కోరారు. కేసీఆర్ హయాంలోనే 50 వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపడితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ పాలకులు మాత్రం తామే ఆ ఉద్యోగాలను ఇచ్చినట్టుగా జబ్బలు చరుచుకుంటున్నారని మండిపడ్డారు. నిరుద్యోగులు చేస్తున్న పోరాటాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

### అవి గత సర్కారు నోటిఫికేషన్లు: బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి తర్వాత నిరుద్యోగుల కోసం ఇచ్చిన కొత్త నోటిఫికేషన్ ఒక్కటీ కూడా ఇవ్వలేదని, గత సర్కారు ఇచ్చిన నోటిఫికేషన్లనే తాము ఇచ్చినట్టుగా సీఎం అబద్ధాలు వల్లిస్తున్నారని బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి మండిపడ్డారు. ఉద్యోగాల భర్తీకోసం నిరుద్యోగుల తరపున బీజేవైఎం ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించిందని తెలిపారు. కేంద్ర మంత్రి బండిసంజయ్ కూడా ఉద్యోగాల భర్తీ కోసం ధర్నాలు నిర్వహించారని చెప్పారు. ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేసేంత వరకు నిరుద్యోగుల తరపున తమ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

### నిరుద్యోగ భృతి ఇవ్వాలి: సీపీఎం నేత జూలకంటి

నిరుద్యోగులు కోరుతున్నది గొంతెమ్మ కోర్కెలేమీ కాదని, వారు అడుగుతున్న ఉద్యోగాలు భర్తీని ప్రభుత్వం వెంటనే చేపట్టాలని సీపీఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఇస్తానన్న రూ.4,000 భృతిని కూడా వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా ఇప్పటి వరకు ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకపోతే.. కాంగ్రెస్ పాలకులు కూడా రాజకీయ నిరుద్యోగాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

### 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాల్సిందే: ఎంపీ ఆర్ కృష్ణయ్య

రాష్ట్రంలో 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసేంత వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టేదే లేదని ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య తేల్చిచెప్పారు. ప్రస్తుతం సర్వీసులో ఉన్న ఉద్యోగులకు 64 ఏండ్ల వరకు వయోపరిమితి పెంచుతారంటూ ప్రచారం జరుగుతుందని, దాన్ని నిరుద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. అందాల పోటీలు, సినిమా వేడుకలకు, ఢిల్లీకి వెళ్లడానికి సమయం దొరుకుతుంది కానీ, నిరుద్యోగుల కోసం ప్రత్యేక సమీక్ష పెట్టడానికి, ఉద్యోగాలు భర్తీ చేయడానికి మాత్రం సీఎం రేవంత్‌రెడ్డికి సమయం లేదా? అని నిలదీశారు. రాష్ట్రంలోని అన్ని శాఖల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.



గణేశ్ అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజలు



వెలిశాలలో గణేశ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న శాసనమండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి

## మావోయిస్ట్ నేత గణేశ్‌కు కన్నీటి వీడ్కోలు

జయశంకర్ భూపాలపల్లి, జూన్ 20 (నమస్తే తెలంగాణ) : పోరాటాల పురిటి గడ్డ వెలిశాల ఎరుపెక్కింది. ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన గాజర్ల రవి అలియాస్ గణేశ్ అలియాస్ ఉదయ్ మృతదేహం శుక్రవారం ఉదయం వెలిశాలకు చేరుకోగానే చూసేందుకు జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, చర్చల ప్రతినిధి అమర్, అరుణోదయ కళాకారుల సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, విప్లవ సంఘం నేతలు గాదె ఇన్నయ్య, చెరుకు సుధాకర్ తదితరులు గణేశ్ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. ప్రజా సంఘాలు, పౌరహక్కుల నేతలు, రాజకీయ నేతలు, విప్లవ కవులు, కళాకారులు గణేశ్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గణేశ్ అంతిమయాత్రకు ఛత్తీస్‌గఢ్, ఒడిశాకు చెందిన మాజీ నక్సలైట్లు, గణేశ్ అభిమానులు, ఉమ్మడి వరంగల్ సహా ఇతర జిల్లాల నుంచి మాజీలు, ప్రజలు హాజరయ్యారు.



భద్రాద్రి జిల్లా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కారు ఎదుట బైఠాయించిన సారపాక వాసులు

## పినపాక ఎమ్మెల్యేకు నిరసన సెగ

- కారు ఎదుట బైఠాయించిన భద్రాద్రి జిల్లా సారపాక వాసులు
- తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్

బూర్గంపహాడ్, జూన్ 20 : తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం సారపాక గ్రామస్థులు శుక్రవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కారు ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. తాళ్లగొమ్మూరు పంచాయతీ పరిధిలో జరిగిన ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. కార్యక్రమం పూర్తయిన తర్వాత అక్కడి నుంచి బయటకు వస్తుండగా సారపాక గ్రామస్థులు ఆయన కారు ఎదుట బైఠాయించారు. తమ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చామని, ఈవోకు సైతం సమస్యను వివరించినా పరిష్కారం కాలేదని ఆరోపించారు. ఎమ్మెల్యే అనుచరులు ఆందోళన చేస్తున్న వారిని సముదాయించి, పక్కకు తీసుకెళ్తుండగా ఈ ఘటనను చిత్రీకరిస్తున్న సెల్‌ఫోన్‌ను సైతం ఆయన అనుచరులు లాక్కున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

## తెలంగాణలోనూ బెస్ట్ బ్రాస్‌బ్యాండ్

**బ్యాండ్ కానిస్టేబుళ్లకు డీజీపీ ప్రశంస**

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోనూ బెస్ట్ బ్రాస్ బ్యాండ్ ఉందని డీజీపీ జితేందర్ వెల్లడించారు. శుక్రవారం పోలీస్ అకాడమీలో జరిగిన బ్రాస్‌బ్యాండ్, బిగులర్(వెలిడిక్షన్) పోలీస్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో మన రాష్ట్రం బెస్ట్ బ్యాండ్‌గా గుర్తింపు పొందనున్నదని ప్రశంసించారు. ఆగస్టు 15, రిపబ్లిక్ డే, రాష్ట్ర అవతరణ వేడుకల్లో ఈ టీమ్‌తో ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు తెలిపారు. పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్ట్ మాట్లాడుతూ.. 53 మంది హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డ్స్ శిక్షణ పొందినట్టు తెలిపారు. ఆరుగురికి డీజీపీ పురస్కారాలు అందజేశారు.

## ఆయేషా మీరా హత్య కేసులో ముగిసిన సీబీఐ దర్యాప్తు

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): ఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు ముగిసింది. 18 ఏండ్ల క్రితం దారుణ హత్యకు గురైన ఆయేషా మీరా కేసును రీ ఓపెన్ చేసి దర్యాప్తు జరిపిన సీబీఐ తుది నివేదికను సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు అందజేసింది. తదుపరి విచారణను ఈ నెల 26కు వాయిదా వేస్తున్నట్టు హైకోర్టు ప్రకటించింది. 2007 డిసెంబర్ 27న విజయవాడ ఇబ్రహీంపట్నంలోని శ్రీదుర్గ లేడీస్ హాస్టల్‌లో అత్యాచారానికి, దారుణ హత్యకు గురైన ఆయేషా మీరాకు న్యాయం చేయాలని తల్లిదండ్రులు 18 ఏండ్లుగా పోరాడుతున్నది

## ఐదు ముంపు గ్రామాలను తెలంగాణలో కలపాలి

- దీనిపై 25న ప్రధాని మోదీతో సమావేశంలో చర్చించాలి
- పోలవరం ముంపుపై సంయుక్త సర్వే నిర్వహించాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



ఖైరతాబాద్, జూన్ 20: విభజన చట్టం ద్వారా ఏపీకి కేటాయించిన ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాల్సిందేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'పోలవరం తెలంగాణపై జలఖడ్గం, ముంపు గోడు' అంశంపై జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఏపీలో కలిపిన పురుషోత్తమపట్నం, గుండాల, ఎటపాక, కన్నాయిగూడెం, పిచ్చుకలపాక గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. కరకట్టల ఎత్తు పెంచుకుంటేనే భవిష్యత్తులో కూడా ఆ ఐదు గ్రామాలకు రక్షణ ఉంటుందని, లేనిపక్షంలో వరద ముంపునకు గురవుతాయని చెప్పారు. పోలవరం వల్ల భద్రాచలం ప్రాంతానికి శాశ్వత ముంపు ముప్పు ఏర్పడిందని, భద్రాచలం రామాలయం మునిగిపోయే ప్రమాదంలో ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే జాగృతి ఆధ్వర్యంలో పోలవరం ప్రాజెక్టును ఆపే ప్రయత్నం చేశామని, సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించామని గుర్తుచేశారు.

### చంద్రబాబువి బ్యాక్‌డోర్ పాలిటిక్స్

రాష్ట్ర విభజన తర్వాత అప్పటి ఏపీ సీఎం చంద్రబాబు బ్యాక్‌డోర్ పాలిటిక్స్ ద్వారా తెలంగాణకు చెందిన ఏడు మండలాలను తీసుకున్నారని కవిత ఆరోపించారు. ఇది విభజన చట్టానికి, రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమన్నారు. బీఆర్ఎస్ సభ్యులుగా నాడు పార్లమెంట్‌లో తాము గళమెత్తితే, కాంగ్రెస్ ఎంపీలు మాత్రం ఏం పట్టనట్టు వ్యవహరించారని విమర్శించారు. అప్పుడు సీఎంగా ఉన్న కేసీఆర్ బంద్‌కు పిలుపునిచ్చారని గుర్తుచేశారు. పోలవరం ముంపుపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు సంయుక్త సర్వే నిర్వహించాలని సూచించారు. ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపడానికి సీఎం రేవంత్ కేంద్రంపై ఒత్తిడి చేయాలని చెప్పారు. ఈ అంశంపై న్యాయ పోరాటానికి వెనుకాడబోమని, కోల్పోయిన గ్రామాలను సాధించుకునేంత వరకు విశ్రమించేది లేదని తేల్చిచెప్పారు.

### అవసరం లేకున్నా ఏపీలో కలిపారు

ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను అవసరం లేకపోయినా ఏపీలో కలిపారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత గోవర్ధన్ అన్నారు. నాడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాముడికి అన్యాయం చేసిందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు ఐదు గ్రామాల సమస్యలపై స్పందించాలని కోరారు. 25న ప్రధాని మోదీ ఆధ్వర్యంలో జరిగే సీఎంల సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడాలన్నారు. సమావేశంలో భద్రాచలం డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు సంపత్, ఐదు గ్రామపంచాయతీల సాధన సమితి ప్రతినిధులు బాలకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం రౌండ్ టేబుల్ సమావేశంలో పలు తీర్మాణాలు చేశారు.

## జీవో-49ను వెంటనే రద్దు చేయాలి

**సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని డిమాండ్**

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ) : ఆదివాసీల సాగుభూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు తీసుకొచ్చిన జీవో-49ను వెంటనే రద్దు చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదిలాబాద్, కుమ్రంభీం, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టైగర్ రిజర్వ్ కారిడార్ పేరుతో ఆదివాసీలు సాగుచేస్తున్న భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీవో-49ని తీసుకొచ్చాయని పేర్కొన్నారు. ఇప్పటికే ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలోని 4లక్షల ఎకరాలను అదానీకి అప్పజెప్పిందని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కాలేదని, పోడు సాగుదారులపై అటవీ అధికారులతో దాడులు చేయించి కేసులు పెడుతున్నదని విమర్శించారు.